క్లుప్తంగా

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

సంతనూతలపాడు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా మండల కేంద్రాలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాటి వైఎస్సార్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు జరిగిన మేలును వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటే వైఎస్సార్ పేరే గుర్తుకొస్తుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ఆయనే ప్రవేశపెట్టి గొప్పగా అమలు చేశారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించి ఆయన అందించిన సేవలను ప్రజలకు గుర్తుచేయాలని మేరుగు సూచించారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు


ఈతముక్కలలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

కొత్తపట్నం: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని పీర్ల ఊరేగింపును కనుల పండువగా నిర్వహించారు. మండలంలోని ఈతముక్కల గ్రామంలో సోమవారం ముస్లిం పెద్దల సమక్షంలో పీర్లను ఊరేగించారు. సంప్రదాయబద్ధంగా మూడు సావిట్లలో మూడు గుమ్మటాలను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రార్థనలు చేసి గ్రామంలో పీర్లను ఊరేగించారు. అనంతరం సముద్రస్నానం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పావు వంతు భూమిని పశుగ్రాసాలకు ఉంచుకోవాలి

కొత్తపట్నం: ప్రతి పాడి రైతు తమ వ్యవసాయ భూమిలో 1/4వ వంతును నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఏకవార్షిక, బహుళ వార్షిక పశుగ్రాసాల సాగుకు ఉపయోగించుకోవాలని పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రవి సూచించారు. మండలంలోని రంగాయపాలెం గ్రామంలో పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పశుపోషణలో పశుగ్రాస ప్రాముఖ్యత గురించి వివరించారు. పశువుల్లో వచ్చే రోగాలు, వాటి తీవ్రతపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి నరసింహులు, ఒంగోలు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ ఎస్.జగత్ శ్రీనివాస్, త్రోవగుంట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ బి.బసవ శంకరరావు, పశువైద్యాధికారి ప్రశాంతి పాల్గొన్నారు. అనంతరం పశుగ్రాస క్షేత్రాలను పరిశీలించారు.

మంచినీటి పథకం పనుల పరిశీలన

చీమకుర్తి రూరల్: మండలంలోని కేవీ పాలెం ప్రజలకు త్వరలో తాగునీటి సమస్య తొలగనుందని గ్రామీణ నీటిపారుదలశాఖ మండల అధికారి శాంతిప్రియ తెలిపారు. కేవీ పాలెం, మర్రిపాలెం తాగునీటి పథకం పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ చీమకుర్తి మండలంలో పశ్చిమ, దక్షిణ ప్రాంతంలోని 19 గ్రామాలకు తాగునీటి కోసం ఈ పథకాన్ని ఏర్పాటు చేయగా, కొన్ని గ్రామాలకు అరకొరగా నీరందుతోందని, దిగువ గ్రామాలైన మువ్వావారిపాలెం, ఏలూరివారిపాలెం గ్రామాలకు గత 15 ఏళ్లుగా చుక్కనీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ రూ.10 లక్షల జెడ్పీ నిధులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు రూ.12 లక్షల నిధులు మంజూరు చేయించడం వలన పథకం పనులు పూర్తవుతున్నాయని తెలిపారు. పనుల పరిశీలనలో పాలడుగు వెంకటనారాయణ, కాంట్రాక్టర్ హరిబాబు పాల్గొన్నారు.

గౌరవం లేదు.. వేతనం లేదు..!

- అలంకారప్రాయంగా మారిన ఎంపీటీసీ పదవి
- మొక్కుబడి సభలు, సమావేశాలకే పరిమితం
- అధికారులకు సమస్యలు విన్నవించినా పట్టించుకోని వైనం
- గౌరవ వేతనం కూడా అందక ఆందోళనలో ఎంపీటీసీ సభ్యులు



మద్దిపాడు: మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపీటీసీ) సభ్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీరికి ఎలాంటి ప్రాధాన్యత లేకుండా పోయింది. ఒకవైపు గౌరవం లేకపోగా, మరోవైపు గౌరవ వేతనం కూడా అందక తమ సంగతి ఏంటా అని వారంతా వాపోతున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు మండలాల్లో ప్రజలచేత ఎన్నుకోబడిన ఎంపీటీసీలు 50 మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా మూడు వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గౌరవ వేతనం సక్రమంగా అందించగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందడం లేదు. దానికితోడు పరిపాలనలో వారికి ఎటువంటి ప్రాధాన్యతా ఉండటం లేదు. టీడీపీకి చెందిన ఎంపీటీసీలను వారి పరిధిలో ఏదైనా సభలు, సమావేశాలు జరిగినప్పుడు ఆహ్వానిస్తుండగా, వైఎస్సార్ సీపీ, ఇతర పార్టీల ఎంపీటీసీలకు అలాంటి ఆహ్వానం కూడా అందడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వంలో కనీస గౌరవం కూడా తమకు లభించడం లేదని ఎంపీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా, గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంపీటీసీలపై కూడా కక్ష సాధింపులు, దుశ్చర్యలకు కూటమి ప్రభుత్వం, ఆయా పార్టీల నాయకులు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు.

వేతనం కోసం ఎదురుచూపులు...

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశాలకు మాత్రమే పరిమితమయ్యారు. సమావేశాలకు హాజరుకావడం మినహా ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు పేర్కొంటున్నారు. కనీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సైతం ఆహ్వానించకపోవడం దారుణమని వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం చెల్లించలేదు. కనీసం ఆ అంశంపై దృష్టి కూడా సారించడం లేదు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికి రెండుసార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగినా ప్రజాప్రతినిధుల ఖాతాల్లో మాత్రం నగదు జమకాకపోవడం ఏంటో అర్థం కావడం లేదని అంటున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు గౌరవ వేతనం మంజూరు చేయలేదని.. కనీసం ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం కూడా ఇవ్వడం లేదని అంటున్నారు. అదే సమయంలో ఎలాంటి హోదా లేనప్పటికీ టీడీపీ నాయకులకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు ఎంపీటీసీ సభ్యులు విమర్శిస్తున్నారు.

ఎంపీటీసీ సభ్యులంటే చులకనభావం...

ప్రజలతో ఎన్నుకోబడిన ఎంపీటీసీ సభ్యులను అధికార యంత్రాంగం చులకనభావంతో చూస్తోందని వారు వాపోతున్నారు. అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడం, పథకాల సమాచారం కూడా ఇవ్వకపోవడం వంటి చర్యలతో అవమానిస్తున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీ సభ్యులను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని, ఇది సరైన పద్ధతి కాదంటూ సంతనూతలపాడు నియోజకవర్గంలోని ఎంపీటీసీ సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన తమకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని, కేవలం సర్వసభ్య సమావేశాలకే తాము పరిమితమవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తమ ప్రాధాన్యత పెంచి గౌరవ వేతనాల చెల్లింపులకు నిధులు కూడా విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు

- కార్యదర్శులకు ఎంపీడీఓ జ్యోతి సూచన


గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి, ఈఓపీఆర్డీ రఘుబాబు

మద్దిపాడు: గ్రామ కార్యదర్శులు పారిశుధ్యంపై అలసత్వం వహించరాదని ఎంపీడీఓ వి.జ్యోతి సూచించారు. సోమవారం గ్రామ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై ప్రభుత్వం ఫోన్ల ద్వారా ప్రజల నుంచి సమాచారం సేకరిస్తోందని తెలిపారు. అందువలన ప్రతి గ్రామ కార్యదర్శి ఉదయమే గ్రామాల్లోకి వెళ్లి పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ, తాను కూడా గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. అనంతరం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వివరాలు సేకరించారు. ప్రతిరోజూ గ్రామాల్లో చెత్త సేకరించాలని, ఆ విధంగా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు సకాలంలో ఇవ్వాలని కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ రఘుబాబు పాల్గొన్నారు.

నీరందించడం లేదంటూ మద్దిపాడు వాసి ఆందోళన...

ఒక వైపు కార్యదర్శుల సమావేశం జరుగుతుండగానే మద్దిపాడు గ్రామానికి చెందిన కడియాల సుబ్బయ్య అనే వృద్ధుడు వచ్చి తమకు గత 15 రోజుల నుంచి నీరివ్వలేదంటూ అధికారులతో ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలల నుంచి విద్యుత్ దీపాలు వెలగడం లేదని, మద్దిపాడు కార్యదర్శి నూరుల్లా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వంలో కంటే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పరిపాలన బాగుందని అన్నారు. అప్పట్లో ప్రజలకు కావాల్సినవన్నీ చేశారని, ఇప్పుడు అధికారులు, ఉద్యోగులు జీతాలు తీసుకుంటూ ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని సుబ్బయ్య వాపోయారు. స్థానికంగా ఉన్న అధికారులు కొందరు ఆయనకు సర్దిచెప్పి పంపించివేశారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతుగా బైక్ ర్యాలీ


ఒంగోలులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: భవిష్యత్ తరాలను కాపాడేందుకు, కార్పొరేట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఒంగోలు నగరంలోని నెల్లూరు బస్టాండు సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు మోటారు బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు వద్ద జరిగిన సభకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. చిట్టిపాటి ప్రసంగిస్తూ నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, పెంచిన పని గంటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఉద్యోగులు, కార్మికులు, ప్రజలందరూ ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి, పి.కల్పన, బి.పద్మ, టి.మహేష్, చీకటి శ్రీనివాసరావు, దామా శ్రీనివాసరావు, బీవీ రావు, ఎంఏ సాలార్, మునవర్ బాషా, జి.శేషయ్య, కృష్ణమోహన్, సుబ్బారావు, దాసరి సుందరం, రాజశేఖర్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు వామపక్షాల మద్దతు...

సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సోమవారం స్థానిక సుందరయ్యభవన్ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల సంయుక్త సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కూటమి పాలకులు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పలేని బలహీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, వివిధ వామపక్షాల నాయకులు ఎస్.లలిత కుమారి, సీహెచ్ సాగర్, కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం చీమకుర్తిలో నిర్వహించిన బైకు ర్యాలీని రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు సీఐటీయూ జెండా ఊపి ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలు ఇవ్వలేకపోతున్నాం


మాట్లాడుతున్న జిల్లా శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్ కుమార్

కొత్తపట్నం: డ్వాక్రా గ్రూపుల మహిళలకు శ్రీనిధి కింద జిల్లాలో రూ.214 కోట్లు మంజూరయ్యాయని, మండలాలలో ఎన్‌పీఏ కింద పోవడం వల్ల ఈ రుణాలు ఇవ్వలేకపోతున్నామని జిల్లా శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.ఉదయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వీవోఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 38 మండలాలకుగానూ 27 మండలాలలో రూ.20 లక్షలకు పైగా ఎన్‌పీఏ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. రూ.20 లక్షలు ఎన్‌పీఏ దాటిన వారికి శ్రీనిధి రుణాలు ఇవ్వలేకపోతున్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. వెలుగు ఏపీఎం విజయకుమారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, ఏపీఎం విజయ కుమారి, సీసీలు పాల్గొన్నారు.

కెమిస్టులు బాధ్యతగా మెలగాలి


- ఔషధ నియంత్రణ శాఖ ఏడీ జ్యోతి సూచన

ఒంగోలు టౌన్: మెడికల్ షాపులు నిర్వహిస్తున్న కెమిస్టులు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, నిషేధిత ఔషధాలు విక్రయించకుండా నిబద్ధతగా వ్యాపారం చేయాలని ఔషధ నియంత్రణ శాఖ అదనపు సంచాలకులు జ్యోతి ఆదేశించారు. ఒంగోలు టౌన్ రిటైల్ మెడికల్ అసోసియేషన్, హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పద్మావతి ఫంక్షన్ హాలులో యాంటీబయాటిక్స్, నార్కోటిక్స్ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె పాల్గొని ప్రసంగిస్తూ యాంటీబయాటిక్స్, నార్కోటిక్స్ ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పనిచేస్తున్న ఆర్‌ఎంపీలు విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ ఔషధాలు వినియోగిస్తున్నారని చెప్పారు. యథేచ్ఛగా వాడటం వలన రోగుల్లో వ్యాధి నిరోధక శక్తి క్షీణించి మరణాల బారిన పడుతున్నారన్నారు. ప్రజారోగ్యానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కెమిస్ట్‌ల మీదనే ఉందన్నారు. అనంతరం నూతన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరాంమూర్తి, బదిలీపై వెళుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భ్రమర సంధ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీసీడీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారెడ్డి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి పాద సేవలు

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ గ్రామంలో సాయి విష్ణువిల్లాస్‌లో ఏర్పాటు చేసిన సాయిబాబా దేవస్థానంలో సోమవారం సాయి పాద సేవలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మహారాష్ట్రంలోని సాయిబాబా దేవస్థానం నుంచి తీసుకొచ్చిన సాయిబాబా పాదుకలను పల్లకిలో ఉంచి సాయివిష్ణువిల్లాస్ ముఖ ద్వారం నుంచి ఊరేగించారు. శంకర్ గ్రూపు అధినేత కంది రవిశంకర్ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి పొన్నూరి శ్రీనివాసరావు, ఒంగోలు సంతపేట సాయిబాబా దేవస్థానం అధ్యక్షుడు ఆళహరి చెంచలరావు, చదలవాడ సర్పంచ్ దాసరి వరప్రసాదరావు, ఉపసర్పంచ్ కోడే సుబ్బారావు, ఒంగోలుకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మాదిగలు రాజకీయ శక్తిగా ఎదగాలి


వర్గీకరణ ఆర్డినెన్స్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: మాదిగల చిరకాల వాంఛ అయిన వర్గీకరణ అంశాన్ని పోరాటం ద్వారా సాధించుకున్నారని, భవిష్యత్‌లో వర్గీకరణ ఫలాలు అందరికీ అందిస్తూనే రాజకీయ శక్తిగా ఎదగాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యులు పానుగోటి కృపాకర్‌మాదిగ, కొమ్మూరి కనకారావు, ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిన మండలంలోని ఈదుమూడి గ్రామంలో సోమవారం 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో అందరికీ సమాన అవకాశాలు అందాలనే ఉద్దేశంతో 31 ఏళ్ల కిందట ఇదే ఈదుమూడి గ్రామంలో మొదలుపెట్టిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేడు దేశంలో ఎన్నో ఉద్యమాలకు ఆధారం అయిందన్నారు. దీనిని ఉపయోగించుకుంటూనే మాదిగలు రాజకీయంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ జెండాను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దండు వీరయ్య మాదిగ, గరటయ్య మాదిగ, ఇంటూరి రోశయ్య, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు నియోజకవర్గ సమావేశాన్ని

జయప్రదం చేయండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున


మేరుగు నాగార్జున

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సంతనూతలపాడు నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున కోరారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఒంగోలులోని విష్ణుప్రియ ఫంక్షన్ హాల్లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు హాజరవుతారని వెల్లడించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని మేరుగు నాగార్జున కోరారు.

రీ అసైన్మెంట్ ప్రక్రియను పరిశీలించిన డీపీఓ


మద్దిపాడులో భవనాల కొలతలను పరిశీలిస్తున్న డీపీఓ వెంకట నాయుడు

మద్దిపాడు: మండలంలో జరుగుతున్న రీ అసైన్మెంట్ ప్రక్రియను డీపీఓ వెంకటనాయుడు సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఎక్కువ స్థలంలో కట్టిన భవనాల వివరాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అటువంటి భవనాలకు తిరిగి కొలతలు వేసి వెంటనే ఆస్తి పన్ను నిర్ధారించాలని ఆదేశాలు జారీ చేశారు. మండలంలో పది వేల చదరపు అడుగుల కంటే విస్తీర్ణం ఎక్కువగా ఉన్న భవనాలను కొలతలు వేసి ఆస్తి పన్ను నిర్ధారించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ క్రమంలో మండలంలో పది వేల చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన 57 భవనాలను గుర్తించినట్లు డిప్యూటీ ఎంపీడీవో కే రఘుబాబు తెలిపారు. ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న భవనాలను గుర్తించి వాటికి ఆస్తి పన్ను నిర్ధారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నూరుల్లా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వై.నవ్య, సర్వేయర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం


వేణుగోపాలరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీఓ జ్యోతి, ఉద్యోగులు

మద్దిపాడు: మద్దిపాడు నుంచి పదోన్నతి బదిలీపై వెళుతున్న సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాలరెడ్డిని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ వి.జ్యోతి పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగం పట్ల నిబద్ధతతో వ్యవహరించిన వేణుగోపాలరెడ్డి పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. గ్రామ కార్యదర్శులు పలువురు మాట్లాడుతూ ప్రతి విషయంలో తమకు వెన్నుదన్నుగా నిలిచిన వేణుగోపాలరెడ్డి అభినందనీయుడన్నారు. ఎంపీడీఓ జ్యోతి చేతుల మీదుగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ డీఎస్‌వీ పర్సాద్, ఈఓపీఆర్డీ రఘుబాబు, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై ప్రజాగ్రహం


సెల్ టవర్‌ను ఏర్పాటును వ్యతిరేకిస్తున్న ప్రజలు

ఒంగోలు టౌన్: నగరంలోని శ్రీనగర్ కాలనీలో నివాస గృహాల మధ్య సెల్ టవర్ ఏర్పాటును స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కాలనీలోని 1వ లైను రెండో క్రాస్ లైనులో గల రిటైర్డ్ మున్సిపల్ టీచర్ ఆలూరి భారతి ఇంటి పైఅంతస్తులో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా సెల్ టవర్‌కు సంబంధించిన పరికరాలను తరలించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు సోమవారం భారతీదేవి ఇంటి వద్దకు వెళ్లి అభ్యంతరం తెలిపారు. ఇరుగుపొరుగు ప్రజలపై సెల్ టవర్ రేడియేషన్ ప్రభావం ఉంటుందని, దీని వలన తీవ్రమైన అనారోగ్యాలు సంభవించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు ఉన్నారని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు భారతీదేవి కుటుంబ సభ్యులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు పట్టించుకోవడం లేదని, మా ఇళ్లు.. మా ఇష్టం, మీ ఇష్టమొచ్చిన చోటికి వెళ్లి చెప్పుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై స్థానికులు కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. నివాస గృహాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, కమర్షియల్ ప్రాంతంలో టవర్ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

గ్రామాల్లో చెత్త తొలగించాలి

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరు, కామేపల్లివారిపాలెం, చంద్రపాలెం, బొడ్డువారిపాలెం, తక్కెళ్లపాడు, చిలకపాడు, మద్దులూరు, వేములపాడు, ఎండ్లూరు, మైనంపాడు, గురువారెడ్డిపాలెం, రుద్రవరం తదితర గ్రామాల్లో చెత్త తొలగించాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఆయా గ్రామాలను ఆయన పరిశీలించారు.